పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

షాబాద్ : మద్దూర్‌లో..

యాచారం : కుర్మిద్దలో..

- పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ప్రారంభించి టీకాలు వేసిన పశు వైద్య సిబ్బంది
- నెల రోజులపాటు కొనసాగనున్న కార్యక్రమం

రంగారెడ్డి జిల్లాలోని పలు మండలాల గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నేడు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాలను ప్రారంభించారు. షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో నెల రోజులపాటు టీకాలు వేయనున్నారు. పలు చోట్ల వైద్యాధికారులు పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు ఒక్కటే మార్గమన్నారు. రైతులు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. వ్యాధి సోకిన పాడి పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తి సమస్యను శాశ్వతంగా పరిష్కరించవచ్చన్నారు. పశు సంపదను కాపాడేందుకు వైద్యుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

షాబాద్ మండలంలో..

షాబాద్ : రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని అన్నారు. షాబాద్ మండల పరిధిలోని మద్దూర్, తిర్మలాపూర్, కుమ్మరిగూడ, కక్కులూర్ గ్రామాల్లో షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి టీకాలు వేశారు.

యాచారం మండలంలో..

యాచారం : మండలంలోని కుర్మిద్ద గ్రామంలో 412 పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని పశువైద్యాధికారి కిరణ్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు.

చేవెళ్ల మండలంలో..

చేవెళ్లటౌన్/చేవెళ్లరూరల్ : మండలంలోని కుర్మిద్ద, పల్గుట్ట గ్రామాల్లో పశువులకు టీకాలు వేసినట్లు చేవెళ్ల మండల పశువైద్య అధికారిణి డాక్టర్ శిరీష తెలిపారు.

చేవెళ్ల రూరల్ : పల్గుట్ట గ్రామంలో..

ఆమనగల్లు వేంకటేశ్వర ఆలయ ఆవరణలో..

మంచాల : ఆగపల్లిలో..

మంచాల మండలంలో..

మంచాల : మండలంలోని ఆగపల్లి గ్రామంలో టీకాల కార్యక్రమాన్ని పశువైద్యాధికారి సుధారెడ్డి ప్రారంభించారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు : పట్టణంలోని 89 ఆవులు, 169 గేదెలకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి డాక్టర్ అగ్నివేశ్ తెలిపారు. బుధవారం కూడా పట్టణంలో మిగిలిపోయిన పశువులకు వేయడం జరుగుతుందని చెప్పారు.

కడ్తాల్‌లో అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

పెద్దఅంబర్‌పేట : చిన్నారులతో కలిసి కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కర్పూరి ఠాకూర్ సామాజిక సేవా సమితి ప్రతినిధులు

రంగారెడ్డి జిల్లాలో మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. శాస్త్రవేత్తగా, అధ్యాపకుడిగా, మిస్సైల్ మ్యాన్‌గా ఆయన అందించిన సేవలు ప్రపంచస్థాయిలో దేశానికి మంచి పేరు తెచ్చిపెట్టాయని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత కలాం అడుగుజాడల్లో నడవాలన్నారు. భారతజాతి గర్వించదగిన వ్యక్తని కొనియాడారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్ : మండల కేంద్రంలో పలు పార్టీల ఆధ్వర్యంలో నాయకులు కలాం చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీలు, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు నర్సింహ ఉన్నారు.

పెద్దఅంబర్‌పేటలో..

పెద్దఅంబర్‌పేట : పెద్దఅంబర్‌పేటలోని చిల్డ్రన్ ఆఫ్ డెక్కన్ ఫౌండేషన్ ఆశ్రమంలో కర్పూరి ఠాకూర్ సామాజిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అశ్విని ఆంజనేయులు కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ట్రస్టు ఆధ్వర్యంలో ఆశ్రమంలోని చిన్నారులకు ఉచితంగా కటింగ్ చేశారు. కార్యక్రమంలో కర్పూరి ఠాకూర్ సామాజిక సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యాపారి కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్ట్

కడ్తాల్, అక్టోబర్ 15 : మండల కేంద్రం సమీపంలో వ్యాపారి పిట్ల కతాల్ కిడ్నాప్‌కు యత్నించిన కేసులో నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను సీఐ మంగళవారం వెల్లడించారు. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం రేమద్దుల గ్రామానికి చెందిన వ్యాపారి కతాల్ హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో నివాసముంటున్నాడు. ఈ నెల 5న కతాల్ తన కుమారుడు శ్యామ్‌కుమార్, బావమరిదితో కలిసి కారులో నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని పోలీస్‌స్టేషన్‌కు తమపై ఉన్న కేసు గురించి మాట్లాడటానికి వెళ్లారు. అనంతరం వారు సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగి వెళ్తుండగా మార్గమధ్యంలోని కడ్తాల్ టోల్‌ప్లాజా వద్దకు రాగానే వారు ప్రయాణిస్తున్న కారుపై బద్రీ, ఆఫ్రోజ్, సురేశ్, కొండల్ అనే వ్యక్తులు రాళ్లతో దాడి చేశారు. కతాల్‌ను కారులో నుంచి బయటికి లాగి విచక్షణారహితంగా కొట్టారు. అనంతరం ముందే సిద్ధంగా ఉంచుకున్న స్విఫ్ట్ కారులోకి కతాల్‌ను తరలించారు. తన తండ్రిపై వావిళ్ల సంజీవ్‌కుమార్ ప్రోద్బలంతోనే దాడి చేయడంతోపాటు కిడ్నాప్ చేశారని కతాల్ కుమారుడు శ్యామ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. విచారణలో భాగంగా ఈ నెల 6న ఏ2 అన్వేశ్ అలియస్ బద్రి (చంద్రాయన్‌పల్లి, మాడ్గుల మండలం), ఏ3 మహ్మద్ నిజాముద్దీన్ (లింగారెడ్డిపల్లి, వెల్దండ మండలం), ఏ4 మహ్మద్ అఫ్రోజ్ (లింగారెడ్డిపల్లి వెల్దండ మండలం), ఏ6 సూగూరి సురేశ్(చంద్రాయన్‌పల్లి, మాడ్గుల మండలం)ను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించి, కిడ్నాప్‌కి వాడిన స్విఫ్ట్ కారుని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. మిగతా నిందితులు ఏ1 వావిళ్ల సంజీవ్‌కుమార్ (పోతేపల్లి, వెల్దండ మండలం), ఏ5 కోడెల కొండల్(బర్కత్‌పల్లి, వెల్దండ మండలం)ను ఈ నెల 14న రాత్రి అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. పిట్ల కతాల్, వావిళ్ల సంజీవ్‌కుమార్ మధ్య ఉన్న వ్యాపార లావాదేవీల కారణంగానే కతాల్‌పై దాడి, కిడ్నాప్ జరిగినట్లు సీఐ తెలిపారు.

మాడ్గుల మండల పరిధిలోని కలకొండ గ్రామంలో నాలుగు రోజులుగా నిర్వహించిన కలకొండ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో విన్నర్స్‌గా కలకొండ పింక్ వారియర్స్, రన్నర్స్‌గా ఎలైట్ ఈగల్స్ టీమ్‌లు నిలిచాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు గెలుపొందిన జట్లకు ప్రైజ్ మనీతో పాటు ట్రోఫీలను అందజేశారు.
- మాడుగుల, అక్టోబర్ 15

ధర్మకర్తల మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల

చేవెళ్లటౌన్, అక్టోబర్ 15 : చేవెళ్లలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి దేవాదాయ శాఖ కమిషనర్, హైదరాబాద్‌వారు నోటిఫికేషన్ విడుదల చేశారని ఫౌండర్ ట్రస్టీ దేవుని వామనాచార్యులు, ఈవో తెలిపారు. ఆసక్తి గలవారు 20 రోజుల్లో సహాయ కమిషనర్, దేవాదాయ శాఖ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని వారు కోరారు.

రేపు దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠాపన

షాద్‌నగర్‌టౌన్, అక్టోబర్ 15 : పట్టణంలోని శ్రీశివమారుతిగీతా అయ్యప్ప మందిరంలో గురువారం దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి అధ్యక్షుడు లక్ష్మర్ ఆంజనేయులు, కార్యదర్శి రేటికల్ నందీశ్వర్, కోశాధికారి దాస కృష్ణయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశన, మండపారాధన, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, జలాదివాసం, రుద్ర హోమాలు, ధాన్యాదివాసం, గురువారం ఉదయం 7.10కి దక్షిణామూర్తి యంత్ర స్థాపన, విగ్రహ స్థాపన, మహాబలి, జయాది హోమం, పుర్ణాహుతి అనంతరం భక్తులకు ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

జై భీమ్ ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ నూతన కమిటీ

యాచారం, అక్టోబర్ 15 : మండలంలోని నందివనపర్తి గ్రామానికి చెందిన జై భీమ్ ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా మరాటి వివేక్, ప్రధాన కార్యదర్శిగా భూపతి గౌతమ్, సమన్వయకర్తగా గుండె రాఘవేందర్, ఉపాధ్యక్షులుగా తెల్గమల్ల పృథ్వీ, సహాయ కార్యదర్శులుగా పెరుమాళ్ల శ్రీకాంత్, పెరుమాళ్ల మధుకర్, కోశాధికారిగా మరాటి అరుణ్‌కుమార్, సాంస్కృతిక కార్యదర్శులుగా పంబాల శివ, తెలగమల్ల కార్తిక్, గుండె మధు, ప్రచార కార్యదర్శులుగా తెలగమల్ల ప్రశాంత్, భూపతి నందు, భూపతి శ్రీశైలం, ఆటల కార్యదర్శులుగా మరాటి నవీన్‌కుమార్, పంబాల శివలింగం, పెరుమాళ్ల వంశీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నిర్మాణాల తొలగింపు

తుర్కయాంజాల్, అక్టోబర్ 15 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి బ్రాహ్మణపల్లిలో పార్కు స్థలంలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను తుర్కయాంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి అదేశాల మేరకు మంగళవారం మున్సిపల్ సిబ్బంది జేసీబీ సహాయంతో కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బ్రాహ్మణపల్లిలోని పార్కు స్థలంలో పలువురు వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేపడుతుండడంతో వాటిని జేసీబీ సహాయంతో కూల్చివేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పార్కు స్థలాలను కబ్జా చేయడానికి యత్నిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పార్కు స్థలంలో చేపట్టిన నిర్మాణాలను జేసీబీ సహాయంతో కూల్చివేయిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సమస్యలు పరిష్కరించాలి

మొయినాబాద్ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న భరద్వాజ కాలనీవాసులు

మొయినాబాద్, అక్టోబర్ 15 : మండల కేంద్రంలోని భరద్వాజ కాలనీలో సమస్యలతో సతమతమవుతున్నామని, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు మంగళవారం పంచాయతీ కార్యదర్శి సుదర్శన్‌కు వినతిపత్రం అందించారు. మురుగు కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపై పారడంతోపాటు ఎక్కడ గుంత ఉంటే అక్కడ మురుగునీరు నిలిచి దోమలు, ఈగలకు నిలయంగా మారాయని చెప్పారు. దీంతో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు వస్తున్నాయన్నారు. రోడ్డుపై కాలినడకన వెళ్లాలన్న చాలా ఇబ్బందిగా ఉందని వివరించారు. ఇండ్ల టాక్స్‌లు వసూలు చేస్తున్నారు కానీ కాలనీలో నెలకొన్న సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకుని సమస్యలను పరిష్కరించాలని కోరారు.

యువకుడు మృతి

మృతుడు ప్రశాంత్(ఫైల్)

మొయినాబాద్, అక్టోబర్ 15 : వరి చేనులో పడి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ గ్రామానికి చెందిన గౌరెల్లి ప్రశాంత్(25)కు ఐదేండ్ల క్రితం వివాహం జరిగింది. కుటుంబ తగాదాలతో మూడేండ్ల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మనస్తాపం చెందిన ప్రశాంత్ మధ్యానికి బానిసయ్యాడు. సుమారు పదేండ్ల క్రితం ప్రశాంత్ తల్లి మరణించింది. అప్పుడప్పుడు ప్రశాంత్ తల్లి సమాధి వద్దకు వెళ్లి వచ్చేవాడు. కాగా మంగళవారం మధ్యాహ్నం తల్లి సమాధి వద్దకు వెళ్లాడు. కొద్దిసేపు అక్కడే ఉండి తిరిగి వస్తుండగా వరిచేను గట్టుపై నుంచి కాలు జారి వరిచేన్లో బోర్లాపడ్డాడు. ఊపిరాడక అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మట్టి కుప్పలతో తిప్పలు

- తరచూ ప్రమాదాలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

కమ్మెట ప్రధాన రోడ్డు పక్కన తవ్వి వదిలేసిన మట్టి కుప్ప

ప్రమాదాలు జరుగుతున్నాయి

దసరా పండుగ వేళ రెండు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. రాత్రి వేళ ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలి
- తులసి, కమ్మెట మాజీ సర్పంచ్

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 15 : చేవెళ్ల మండల పరిధి కమ్మెట గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన మిషన్ భగీరథ పైప్‌లైన్ కోసం తవ్విన మట్టిని పూడ్చకుండా అలాగే వదిలేయడంతో ప్రయాణికులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు, ఆర్‌అండ్‌బీ ఏఈకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. రోడ్డు పక్కనే మట్టి కుప్పలు ఉండడంతో రాత్రివేళ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని వేడుకుంటున్నారు.

బెదిరించిన వ్యక్తికి రిమాండ్

చేవెళ్లటౌన్, అక్టోబర్ 15 : డబ్బులివ్వకుండా బిర్యానీ టోకెన్ ఇవ్వాలని లేకపోతే చంపేస్తానని బెదిరించిన వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించిన సంఘటన చేవెళ్లలో జరిగింది. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం.. షాబాద్ మండలంలోని మిద్దెంగూడ గ్రామానికి చెందిన బుర్ర రాములు సోమవారం రాత్రి చేవెళ్లలోని షాబాద్ చౌరస్తా వద్ద ఉన్న ఎంజీ ఫుడ్ కోర్ట్ హోటల్‌కు వచ్చి డబ్బులివ్వకుండా బిర్యానికి టోకెన్ ఇవ్వాలని రాములు యజమాని ఇఫ్రాన్‌ను అడిగాడు. పాత బాకీని ఇవ్వాలని ఇఫ్రాన్ అడుగగా గొడవపడ్డాడు. బిర్యానీ టోకెన్ ఇవ్వకపోతే చంపేస్తానని బెదిరించడంతో ఇఫ్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాములును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 15 : దళితులపై కుల వివక్ష చూపిన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లవాడ గ్రామంలో గత 20 ఏండ్లుగా గ్రామస్తులు కలిసి దుర్గామాతను ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. ఈసారి కూడా ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. దసరా రోజు దుర్గామాత నిమజ్జన కార్యక్రమాన్ని పెట్టుకున్నారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన మాదిగ కులస్తుడైన బోనగిరి అర్జునయ్య పిల్లలు మండపంలో పూజలు చేసేందుకు వెళ్లడంతో.. గమనించిన అగ్రవర్ణాలకు చెందిన కొందరు వ్యక్తులు లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న అర్జునయ్య ఇదేంటని ప్రశ్నించగా తర్వాత మాట్లాడుతామని చెప్పి పంపించారు. ఈ విషయంపై ఈ నెల 13నమాట్లాడుకుందామని పంచాయితీకి పిలిచి కులం పేరుతో దూషిస్తూ బూతులు తిట్టి కర్రలతో దాడి చేశారు. దీంతో బాధితులు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కులం పేరుతో దూషించిన నిందితులను 24 గంటల్లో అరెస్ట్ చేయాలని.. లేదంటే పోలీస్‌స్టేషన్‌ను ముట్టడిస్తామని దళిత సంఘాల నేతలు మంగళవారం చేవెళ్ల పోలీస్ స్టేషన్ ఆవరణలో నిరసన తెలిపారు.

వ్యక్తిపై కల్లుసీసాతో దాడి

హత్యాయత్నం కేసు నమోదు చేసి జైలుకు పంపిన పోలీసులు

నిందితుడు చాకలి కోటేశ్

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 15 : కల్లు కాంపౌండ్ యజమానిపై కల్లుసీసాతో దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి జైలుకు తరలించారు. ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని బండ్లగూడకు చెందిన బుర్ర సత్తయ్య(60) చేవెళ్ల మండల పరిధి కుమ్మెర గ్రామంలో కల్లు దుకాణం నిర్వహిస్తున్నాడు. కుమ్మెర గ్రామానికి చెందిన చాకలి కోటేశ్(35) రోజూ కల్లు కాంపౌండ్ వద్దకు వచ్చి కల్లు తాగేవాడు. సోమవారం మధ్యాహ్నం కాంపౌండ్‌కు వచ్చిన అతను డబ్బులిచ్చి కల్లు తీసుకున్నాడు. సత్తయ్య కూడా కల్లుకు సరిపడా తీసుకొని మిగతా డబ్బులిచ్చాడు. అయితే కోటేశ్ కల్లు తాగిన తర్వాత తనకు డబ్బులు ఇవ్వలేదని సత్తయ్యతో గొడవపెట్టుకున్నాడు. అంతటితో ఆగకుండా కల్లు సీసా పగులగొట్టి అతడిపై దాడి చేశాడు. దీంతో సత్తయ్య తల, కుడి చేయి భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. గమనించి అక్కడే ఉన్న నరేశ్, కావలి కుమార్ గొడవను ఆపారు. అనంతరం సత్తయ్య చేవెళ్ల మండలం కేసారం గ్రామంలో ఉండే తన బంధువైన కాసుల రాఘవేందర్ గౌడ్‌కు ఫోన్‌లో విషయం చెప్పాడు. అతడు వెంటనే అక్కడకు చేరుకొని చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తరలించాడు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి జైలుకు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

మాడుగుల, అక్టోబర్ 15 : ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మాడుగుల సీఐ జగదీశ్ తెలిపారు. మంగళవారం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ మాట్లాడుతూ.. ఆదివారం నిబంధనలకు విరుద్ధంగా మాడుగుల, ఇర్విన్, అర్కపల్లిలో డీజేలు ఉపయోగించినవారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇకముందు ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా డీజేలు వాడితే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

బురదమయం

బురదమయంగా 12వ వార్డు రిత్విక్ కాలనీ రోడ్డు

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 15 : శంకర్‌పల్లి మున్సిపాలిటీ 12వ వార్డులోకి రిత్విక్ కాలనీలో చిన్నపాటి వర్షానికే రోడ్డు బురదమయంగా మారడంతో ప్రయాణికులు, ప్రజలు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ద్విచక్రవాహనాలైతే మరీ వెళ్లలేని పరిస్థితి. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగా పరిస్థితిని పరిశీలించి రెండు నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కరించకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.

దిగులొద్దు.. రాబోయే కాలం మనదే

వ్యవసాయ యూనివర్సిటీ : రాబోయే కాలం బీఆర్ఎస్‌దే అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్ రెడ్డి అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ శాస్త్రీపురం డివిజన్ నాయకులు ఆయనకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో మనమందరం కలిసి పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రజలంతా కేసీఆర్‌నే కోరుకుంటున్నారని తెలిపారు. స్థానిక సమస్యలను వెనువెంటనే పరిష్కరించేందుకు తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఎండీ ముక్రమ్‌ఖాన్, అహ్మద్‌పటేల్, ఎండీ హసీఫ్, జాఫర్ పాషా పాల్గొన్నారు.

శంకర్‌పల్లి మండల పరిధి చందిప్ప గ్రామంలోని మరకత శివాలయాన్ని శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం దర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి సీఐని సన్మానించి స్వామివారి ఫొటోను అందజేశారు.
- చేవెళ్ల రూరల్, అక్టోబర్ 15

దామగుండంపై దమనకాండ

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొంపల్లి అనంతరెడ్డి

మొయినాబాద్, అక్టోబర్ 15 : పచ్చదనం పెంచి ప్రకృతిని కాపాడి మానవ మనుగడకు జీవం పోస్తూ పర్యావరణ సమతుల్యతను కాపాడాల్సిన ప్రభుత్వాలు.. అభివృద్ధి పేరుతో ప్రకృతిని విధ్వంసం చేయడం తగదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాలపై పెను ప్రభావం చూపించే నేవీ కారిడార్ శంకుస్థాపన ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటిదన్నారు. సుమారు 2900 ఎకరాల్లో విస్తరించిన అటవీ ప్రాంతంలో వివిధ రకాల చెట్లతోపాటు ఔషధ వన మూలికలున్న ప్రాంతాన్ని నేవీ కారిడార్ ఏర్పాటుతో విధ్వంసం చేసి జీవకోటి ప్రాణులకు పెను ముప్పు కలిగించడం అభివృద్ధి కాదని మండిపడ్డారు. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల ప్రజలు వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వ పెద్దల స్వలాభం కోసమే నేవీ కారిడార్ ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. నేవీ కారిడార్ ఏర్పాటు కోసం సుమారు 12లక్షల90 వేల చెట్లను ధ్వంసం చేయనున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో కారిడార్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేయగా ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకతను గమనించి, ప్రజల అభిప్రాయాలను సేకరించి కారిడార్ ఏర్పాటు నిర్ణయాన్ని గత ప్రభుత్వం వెనుకకు తీసుకుందని ఆయన గుర్తు చేశారు. భారీ పోలీసుల పహారాలో, ప్రజలను ఎక్కడికక్కడ నిర్బంధించి కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కారిడార్ ఏర్పాటుకు నిర్ణయాలు తీసుకుంటున్న సమయంలో వికారాబాద్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు తీవ్రంగా వ్యతిరేకించి.. ఇప్పుడు అధికారంలోకి రాగానే కారిడార్ ఏర్పాటును ఎందుకు స్వాగతిస్తున్నారో ఆ జిల్లా కాంగ్రెస్ నేతలు, ప్రస్తుత ఎమ్మెల్యేలు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. నేవీ కారిడార్‌ను ఏర్పాటు చేస్తుంటే గ్రీన్ ట్రిబ్యునల్, పర్యావరణవేత్తలు ఎందుకు మౌనం పాటిస్తున్నారని, తమ మౌనంతో మానవాళి మనుగడకు పెను ప్రమాదం వాటిల్లుతుందని పేర్కొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు

యాచారం, అక్టోబర్ 15 : ఎలాంటి అనుమతులు లేకుండా ఎక్కువ మొత్తంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను యాచారం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ శంకర్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని నందివనపర్తి గ్రామానికి చెందిన ముక్తాల లింగం, పంబాల భిక్షం కలిసి మండల కేంద్రంలోని లక్కీ వైన్స్ వద్ద ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎక్కువ మొత్తంలో మద్యాన్ని కొనుగోలు చేశారు. గ్రామంలో అధిక ధరలకు విక్రయించేందుకు ఆటోలో నింపుకొని తరలిస్తుండగా సమాచారమందుకున్న పోలీసులు మొగుళ్లపంపు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. పోలీసులను చూసి వారిద్దరు పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు అప్రమత్తమై అదుపులోకి తీస